# ఉపాధ్యాయ దినోత్సవం బహిష్కరణ

**- జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నిర్ణయం**

చిత్తూరు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సోమవారం జరగనున్న ఉపాధ్యాయ దినోత్స వంను బహిష్కరించాలని చిత్తూరు జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య పిలుపునిచ్చింది. చిత్తూరులో శనిఆరం యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శుల ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల నిరంకుశంగా వ్యవహరించడం, అరెస్టులు, జైలు, కేసుల పేరిట వేధిస్తోందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో ఉపాధ్యాయులు సన్మానం చేసుకోకూడదని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రదాన కార్యదర్శులు పి.సుధాకర్‌రెడ్డి, జివి రమణ, ఎపిటిఎఫ్ 1938 జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.కిరణ్‌కుమార్, నాదముని, ఎపిటిఎఫ్ 257 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.గోపినాథ్, ముక్తార్ అహ్మద్, అప్టా జిల్లా ప్రధాన కార్యదర్శి మునాఫ్, రూట అధ్యక్షుడు మునీర్ తదితరులు పాల్గొన్నారు.




# స్వామీ చల్లంగా చూడు

**-శ్రీవారిని ప్రార్థించిన మంత్రి చెల్లుబోయిన**



తిరుమల, సెప్టెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలోని ప్రజలందరినీ చల్లంగా చూడాలని, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థించినట్లు రాష్ట్ర సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. శనివారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు.

# 'రెవెన్యూ' దెబ్బకు గుండెపోటుతో రైతు మృతి

**భూ సమస్య పరిష్కారం కోసం ఏళ్ళ తరబడి ప్రదక్షిణ - సమస్య తేల్చాలంటూ ఎంఆర్ఓ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరాహారదీక్ష**
**నేడు ఆర్ఐ, రైతు మధ్య వాగ్వివాదం - కార్యాలయంలోనే గుండెపోటుతో రత్నం బోయడు మృతి**
**- న్యాయం కోసం తహసిల్దారు కార్యాలయం ముట్టడి - పెనుమూరులో ఉద్రిక్తత**







భూవివాదం పరిష్కరించాలని శుక్రవారం తహసిల్దారు కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న రైతు రత్నం బోయడు(ఫైల్‌ఫోటో), తహసిల్దారు కార్యాలయంలో గుండెపోటుతో మృతి చెందిన రైతు రత్నం బోయడు, న్యాయం కోసం బైఠాయించిన కుటుంబ సభ్యులు.

పెనుమూరు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

రెవెన్యూ అధికారుల దెబ్బకు ఓ భూ సమస్య పరిష్కరించాలని ఏళ్ళ తరబడి కాళ్ళు అరిగేలా తహసిల్దారు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న రామకృష్ణాపురం రైతు రత్నం బోయడు(64) శనివారం తహసిల్దారు కార్యాలయంలోనే గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందాడు. తహసిల్దారు కార్యాలయంలోనే రైతు రత్నం బోయడు గుండెపోటుతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు భారీగా తహసిల్దారు కార్యాలయం వద్దకు చేరుకొని కార్యాలయంను ముట్టడించారు. రత్నం బోయడు భూ సమస్యను సత్వరం పరిష్కరించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. పెనుమూరు మండలం రామకృష్ణాపురం గ్రామంకు చెందిన రత్నం బోయడుకు గ్రామ సమీపంలో 2.52 ఎకరాలు డికెటి పట్టా వుంది. అయితే ఈ భూమిపై రత్నం బోయడుకు డికెటి పట్టా వున్నప్పటికీ ఈ భూమిని స్వాధీనం చేసుకొని అతను సాగు చేయడానికి స్థానికులు, అధికారులు అంగీకరించడం లేదు. గత 47 సంవత్సరాలుగా రత్నం బోయడు భూ వివాదంను రెవెన్యూ అధికారులు పరిష్క రించకపోవడంతో ఈ వివాదం అలాగే కొనసాగుతుంది. ఈ క్రమంలో తనపై వున్న డికెటి పట్టా ఇతరుల ఆక్రమణకు గురి కాకుండా చేయాలని భావించిన రత్నం బోయడు ఈ భూ వివాదంపై కోర్టును సైతం ఆశ్రయించాడు. ప్రస్తుతం ఈ భూవి వాదంపై కోర్టులో కేసు నడుస్తోంది. 2008 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ఆ భూమిలో 16 మంది లబ్దిదారులకు ఇంటి స్థలాలు మంజూరు చేసింది. అప్పట్లో రత్నం బోయడు ఈ ఇంటి నిర్మాణాలు చేపట్టకుండా చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో అక్కడ లబ్దిదారులు ఇళ్ళను నిర్మించుకొని కాపురాలు వుంటున్నారు. రత్నం బోయడు స్థలంలోని ఇళ్ళను ప్రస్తుతం రాజా ఇండ్లుగా పిలుస్తున్నారు. ఈ ఇళ్ళ నిర్మాణాలు మినహాయించి మిగిలిన భూమిను తనకు స్వాధీనం చేయాలని రైతు నాయకుల, అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నాడు. అయితే ఇటు నాయకులు, అటు అధికారులు రత్నం బోయడుకు స్థలంను అప్పగించడానికి ముందుకు రాలేదు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం రత్నం బోయడు తన స్థలంను చదును చేయడానికి ఉపక్రమించాడు. ఇది తెలిసిన రెవెన్యూ అధికారులు వెళ్ళి స్థలంలో రత్నం బోయడు చదువు చేయకుండా పనులు నిలిపివేశారు. తన స్థలంను చదను చేస్తుంటే అధికారులు అడ్డగించడంతో రత్నం బోయడు శుక్రవారం న్యాయం కోసం తహసిల్దారు కార్యాలయం ఎదుట నిరాహారదీక్షకు ఉపక్రమించాడు. శుక్రవారం అధికారులు స్పందించకపోవడంతో రత్నం బోయడు సాయంత్రానికి దీక్ష విరమించి ఇంటికెళ్ళాడు. మళ్ళీ శనివారం ఉదయం తహసిల్దారు కార్యాలయం ఎదుట చేరుకొని దీక్షకు ఉపక్రమించాడు. ఈ క్రమంలో తహసిల్దారు కార్యాలయంలో విధులు నిర్వర్తించడానికి వచ్చిన ఆర్ఐ నారాయణరెడ్డి దీక్షలో వున్న రైతు రత్నం బోయడును కార్యాలయంలోకి పిలిచాడు. ఈ సమయంలో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకొంది. తనకు న్యాయం చేసి తన పేరిట వున్న డికెటి పట్టా భూమిని తనకు అప్పగించాలని రైతు రత్నం బోయడు కోరాడు. ఇద్దరి మధ్య మాటలు తీవ్ర రూపం దాల్చడంతో రైతు రత్నం బోయడుకు ఒక్కసారిగా గుండెనొప్పి రావడంతో తహసిల్దారు కార్యాలయంలోనే కుప్పకూలిపోయాడు. రత్నం బోయడును చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా వైద్యాధికారులు అప్పటికే రత్నం బోయడు మృతి చెందాడని నిర్ధారించడంతో కుటుంబ సభ్యులు మృతదేహంతో నేరుగా తహసిల్దారు కార్యాలయం ఎదుటకు చేరుకొని ఆందోళనకు సిద్ధమయ్యారు. గుండెపోటుతో మృతి చెందిన రత్నం బోయడుకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు వున్నారు. తమ తండ్రిని రెవెన్యూ అధికారులే పొట్టన పెట్టుకొన్నారని కుమారులు శివప్రసాద్, శివకుమార్, కుమార్తెలు జ్యోతి, మణిలు ధ్వజమెత్తారు.

## మూషిక వాహనంపై
# అలరించిన ఏకదంతుడు

కాణిపాకం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:



కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్స వాలలో భాగంగా శనివారం సిద్ధి బుద్ధి సమేతుడైన గణ నాధుడు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన మూషిక వాహనంను అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. గత నెల 31 నుండి జరు గుతున్న బ్రహ్మోత్స వాల నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా శనివారం రాత్రి ఆలయ ఛైర్మన్ ఎ.మో హన్‌రెడ్డి, ఈఓ ఎంవి. సురేష్‌బాబుల ఆధ్వర్యంలో స్వామివారికి మూషిక వాహన సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వ హించారు. ఈకార్యక్ర మానికి కాణిపాకం, తిరువ ణంపల్లె , అగరంపల్లె, పట్నం, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చినకాంపల్లె, గ్రా మాదుల విశ్వకర్మ వంశ స్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు వీరు మధ్యాహ్నం వరుస ఉభయం తీసుకురాగా ఆలయ అర్చకస్వాములు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ నూతన ఆలయంలోని స్వామివారి మూలవిరాట్‌కు వివిధ రకాల పరిమళ సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి అలంకరించి ధూపదీపనైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్స వమూర్తులను అలంకార మండపంలో వుంచి అర్చకులు అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి మరోమారు ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం వివిధరకాల పుష్పాలతో అలంకరించిన తనకిష్టమైన మూషికవాహనంపై స్వామి అమ్మవార్లను వుంచి మంగళవాయిద్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనల నడుమ కాణిపాకం గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్‌బాబు, ఈఈ వెంకట నారాయణ, ఏసీ కస్తూరి, ఏఈఓలు విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, హేమమాలిని, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్ పెక్టర్‌లు బాబు, రమేష్, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డిలతో పాటు ఉత్స వ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# శివయ్య సన్నిధిలో పెరుగుతున్న భక్తులు



శివయ్యదర్శనం కోసం క్యూలైన్లలో నిరీక్షిస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు,అతిధుల సంఖ్య పెరుగుతుంది.గత వారం రోజులుగా వెల వెల బోయిన ఆలయం శనివారం భక్తుల రద్దీతో కళ కళ లాడింది. వారంరోజుల పాటు 15వేలు దాటని భక్తులు శనివారం ఒకే సారి 20 వేలు దాటారు. ఆలయానికి సంబంధించిన నాలుగు గేట్లలోజనం కళ కళ లాడారు. సన్నిధివీధిలో వాహనాల పార్కింగ్‌తో నిండింది. అయితే వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వచ్చిన భక్తులు,అతిధులకు సుదర్శనం,సత్వర దర్శనం చేసుకొనుటకు చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఓ వికె సాగర్‌బాబులు ప్రణాళికలు రచించుకున్నారు. దేవస్థానం అందించిన సమాచారం మేరకు 20వేల మందిభక్తులు సాయంత్రం వరకు దర్శనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో రూ.200దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసి 510 మంది, రూ.50వ దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసి నాల్గవ గేట్ ద్వారా 1428 మంది ప్రవేశించారు. కాగా రూ.500ల టిక్కెట్లతో రాహుకేతుదోష నివారణ పూజలు 2218 మంది, రూ.750ల టిక్కెట్లు కొనుగోలు చేసి 940మంది, రూ.1500ల టటిక్కెట్లతో 221పూజలు, రూ.2500ల టిక్కెట్లతో 256 రూ.5వవేల టిక్కెట్లతో 50 మంది దర్శనం చేసుకున్నట్లు ప్రకటించారు. కాగా అభిషేకాలు విశేష సంఖ్యలో జరిగాయి. 61 మందిని అనుమతించారు. మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 27 జరిగాయి. ఇక శనివారం కావటంతో శనీశ్వరునికి విశేష సంఖ్యలో పూజలు జరుపుకొనుటకు ముందుకు వచ్చారు. 43 మంది అభిషేకాలు జరిపించుకున్నారు.

# విద్యుదాఘాతానికి గురై యువకుడు దుర్మరణం



ఓజిలి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

ఓజిలి మండలం పెదపరియ పంచాయతీ మాజీ సర్పంచ్ బట్టి కాయల కృష్ణయ్యగౌడ్ కుమారుడు బట్టికాయల సుజిత్ శనివారం విద్యుదాఘాతానికి గురై దుర్మరణం పాలయ్యాడు. గ్రామస్థుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బట్టికాయల సుజిత ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా విద్యుదాఘా తానికి గురయ్యాడు. ఈ సంఘటన ఓజిలి మండలంలోని రాజుపాలెంలో చోటుచేసుకుంది. జాతీయ రహదారి పక్కన ఉన్న రాజుపాలెం వద్ద పొలంలో దుక్కి దున్నుతుండగా విద్యుత్ తీగలు తగిలడంతో మృతిచెందాడు. ప్రస్తుతం సుజిత్ గ్రామవాలంటీర్‌గా పనిచేస్తున్నాడు. సుజిత్ అకాల మృతితో పెదపరియ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఓజిలి ఎస్ఐ డి.ఆదిలక్ష్మి ఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిపై సమీక్ష

తిరుమల, సెప్టెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:





తిరుపతిలో టిటిడి ప్రతిష్టాత్మ కంగా నిర్మిస్తున్న చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి, పద్మా వతి చిన్నపిల్లల హృదయాలయం అభివృద్ధిపై ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి సమీక్షించారు. అమరావతినుంచి ఆయన జరిపిన వర్చువల్‌సమీక్షలో తిరుపతినుంచి టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి, జెఇఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, ఎస్ఎసిఎఓ బాలాజీ, సిఇ నాగేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు. ఇప్పటివరకు 615వరకు చిన్నపిల్లలు గుండెశస్త్రచికిత్స లు విజయవంతంగా నిర్వహించామని ఇఓ తెలిపారు.

# శ్రీకాళహస్తి కళంకారి క్లస్టర్ ఆదర్శంగా నిలవాలి

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ః



శ్రీకాళహస్తి క్లస్టర్ ఆదర్శంగా నిలవాలని, రాష్ట్రంలోనే క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో మొదటి అనుమతి పొందిందని జిల్లా కలెక్టర్, ఛైర్మన్ జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సా హక కమిటి (డీఐఈపీసీ) కె. వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఐఈపీసీ ఛైర్మన్ అధ్యక్షతన పారిశ్రామికవేత్తలతో, ఔత్సా హిక పారిశ్రామిక వేత్తలతో, కమిటీ సభ్యులతో సమావేశమై పరిశ్రమల ప్రాధాన్యత అనుమతులు రాయితీలు మంజూరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో తుడా వీసీ హరికృష్ణ, జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్ ,జోనల్ మేనేజర్లు , ఏపీఐఐసీ తిరుపతి సుహానా సోనీ, చంద్రశేఖర్, లీడ్ బ్యాంకు మేనేజర్ సుభాష్, ఫాప్సి సభ్యులు దేవేంద్రరెడ్డి, శ్రీసిటీ ప్రతినిధి భగవాన్, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉష్ణోగ్రతలు
3/9/2022



- తిరుపతి 31 డిగ్రీలు
- చిత్తూరు 33 డిగ్రీలు
- మదనపల్లి 27 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 33 డిగ్రీలు
- వెంకటగిరి 34 డిగ్రీలు
- గూడూరు 33 డిగ్రీలు

## బంగారం ధరలు
3/9/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,722

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,151

## కోడిగ్రుడ్ల ధరలు
3/9/2022



కోడిగ్రుడ్డు :రూ.5.00
1 డజను: రూ.60.00

# పరిశుభ్రంగా పాఠశాల పరిసరాలు : కలెక్టర్

గుడిపాల, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:



ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాడు-నేడు కార్యక్రమంను పక్కాగా సద్వినియోగం చేసుకొని పాఠశాలలను పరిశుభ్రంగా వుంచుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ పిలుపునిచ్చారు. కలెక్టర్ హరినారాయణన్ శనివారం గుడిపాల మండలంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను తనిఖీ చేశారు. కలెక్టర్ మొదట జడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించి పాఠశాల పరిధిలో వున్న 7.5 ఎకరాల స్థలం వుందని పాఠశాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. పాఠశాలలో క్రీడా మైదానం ఏర్పాటు చేసి ఉత్తమ క్రీడాకారులను తీదిద్దడానికి శ్రీకారం చుట్టాలన్నారు. అలాగే విద్యార్థులకు ప్రభుత్వ మెను మేరకు నాణ్యమైన భోజనం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు వండిన ఆహారంను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ అంగన్‌వాడీ కేంద్రంను తనిఖీ చేసి పిల్లలకు శారీరక అభివృద్ధిలో ఎదైనా లోపం వుంటే సత్వరం చర్యలఉ తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ఎల్‌పురం గ్రామ సచివాలయంను తనిఖీ చేసి సచివాలయ సిబ్బంది మరింత మెరుగ్గా విధులు నిర్వర్తించాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయంలోని రికార్డులు, బయోమెట్రిక్‌ను పరిశీలించి కలెక్టర్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. సచివాలయ సిబ్బంది ప్రతి రోజు సాయంత్రం 3 నుండి 5 గంటల వరకు సచివాలయంలో తప్పకుండా వుండి ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీలు స్వీకరించి వాటిని పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ క్యాక్రమంలో ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్, ఎంపిడిఓ ఉపేంద్ర, ఎంఇఓ రామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పంటపొలాలపై ఒంటరి ఏనుగు బీభత్సం

**బిక్కుబిక్కుమంటున్న గ్రామస్తులు**



పంటలను ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు

పెద్దపంజాణి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ః మండలంలో ఒంటరి ఏనుగు బీభత్స ం సృష్టిస్తోంది. పెద్దకాప్పల్లి, కొత్తబూరుగపల్లి, సమీపం లోని పంటపొలాల్లో రాత్రి సమయంలో సంచరిస్తూ కొత్తబూరుగపల్లిలో ఈశ్వరమ్మ, ఆనందా టమోట తోట, వెంకటప్ప చెరకు, పెద్దకాప్పల్లిలో రమణారెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి మామిడి తోట, కొబ్బరి తోట, జిట్టంవారి పల్లి సుబ్రమణ్యం రెడ్డి అరటితోటలను పూర్తిగా ధ్వంసం చేసింది. అయితే ఇది తమిల్‌నాడు నుంచి వచ్చిన ఏనుగా లేక కర్ణాటక నుంచి వచ్చిన ఏనుగా గుంపునుండి విడిపోయిందా అనేది తెలియండంలేదు. దొరికింది దొరికినట్లు పంటలను ధ్వంసం చేస్తోంది. మరోపక్క చీకటి పడితే రైతులు పంటపొలాల వద్దకు వెళ్ళేందు భయాందోలన చెందుతున్నారు. ఒంటరి ఏనుగు వలన పంటపొలాలు తీవ్రనష్టం జరుగుతోందని రైతులు పంటలపై లక్షల రూపాయలు ఖర్చు పెట్టి ఆందోలన వ్యక్తం చేస్తున్నారు. అటవీ అధికారులు దారి మళ్ళించేందుకు ప్రయత్నిస్తున్న ఒంటరి ఏనుగు జాడ కన్పించడంలేదు. దీంతో రైతులు తీవ్రంగా ఆందోలన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఏనుగు జాడ కనుగొని దారి మళ్ళించే దిశగా చర్యలు చేపట్టాలని రైతాంగం కోరుకున్నారు. ఈ ఒంటరి ఏనుగు మధపటేనుగా మారిందంటే మరింత ఆందోళనకరమైన పరిస్థిలు తలెత్తే ప్రమాదంవుంది అటవీ అధికారులు స్పందించాల్సి వుంది.

# మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

**- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మేయర్ అముద**



చిత్తూరు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: నగర పరిధిలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేపట్టాలని మేయర్ అముద అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అముద అధ్యక్షతన శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులులు హాజరయ్యారు. ఈ సమావేశంలో మేయర్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో అన్ని డివిజన్లలో ప్రాధాన్యతక్రమంలోఅభివృద్ధి కార్యక్రమాలు శ్రీకారం చుట్టామన్నారు. స్థానిక కార్పొరేటర్లు అధికారులను సమన్వయం చేసుకొని అభివృద్ధి పనులను త్వరితంగా పూర్తి చేయాలన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ నగర పరిధిలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర స్థాయిలో సమస్యలు ఎక్కడిక్కడ పరిష్కారం అవుతుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై వచ్చిన వినతులను పరిశీలించి ఒక నెల వ్యవధిలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నగరపరిధిలోని ప్రతి డివిజన్‌లో4నుండి5కోట్లరూపాయల వరకు ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నా యన్నారు. సమావేశంలో కట్టమంచి చెరువు వద్ద సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు, గంగినేని చెరువు పార్కును బాబు జగ్జీవన్‌రావ్ పార్కుగా నామకరణం చేస్తూ,చిత్తూరు గాంధీ విగ్రహం కూడలిలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు చేయడానికి సమావేశం ఆమోదించింది. అలాగే ఎంఎయండీ ఉత్తర్వుల మేరకు ప్రస్తుత వున్న నీటి సరఫరా ఛార్జీలు పెంపుకు సమావేశంఆమోదంతెలిపింది. అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్, డిప్యూటీ మేయర్లుఆర్.చంద్రశేఖర్,రాజేష్‌కుమార్‌రెడ్డిలు,కార్పొరేటర్లు,కో-అప్షన్ సభ్యులు,నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

## పజాసంక్షేమమే ప్రభుత్వధ్యేయం - ఎమ్మెల్సీ భరత్



శాంతిపురం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

ప్రజాసంక్షేమమేవైకాపాప్రభుత్వధ్యేయమని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లావైకాపాఅధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. శనివారం చిన్నారి దొడ్డిలో గడపగడపకూ మీ ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదాఅని అడిగి తెలుసుకున్నారు. అర్హులైనప్రతికుటుంబానికి పతకాల్లో తప్పక లబ్ది కలిగిస్తామ న్నారు. మూడేళ్ళ పాలనలో సిఎం జగనన్న ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం 95శాతం అమలు చేశారన్నారు. ప్రజలు వైకాపానుమరింతఆదరించాలనికోరారు. వడ్డెరకార్పోరేషన్‌డైరెక్టర్‌పెద్దన్న, జెడ్పీటిస శ్రీనివాసులు, ఎంపిపి వసుందరకోదండరెడ్డి, మాజీరెస్కోఛైర్మన్‌చక్రపాణిరెడ్డి, మండలకన్వీనర్‌దండపాణి, రఘురాంరెడ్డిపాల్గొన్నా రు

## సచివాలయాలను తనిఖీ చేసిన డీపీఓ లక్ష్మి



పెద్దపంజాణి సెప్టెంబర్ 3 ప్రభాతవార్త : మండలంలోని కోగిలేరు, రాయలపేట సచివాలయాలను శనివారం డీపీఓ లక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోపలు రికార్డేలను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది విధిగా యూనిఫాం దరించి విధులకు హాజరు కావాలని సూచించారు. చెత్త నుండి సంపద తయారీ చేస్తున్న డంపింగ్ యార్డులను పశీలించి అమ్మకానికి సిద్దంగా వున్న వర్మీకం ఎరువును రైతులకు విక్రయించి గ్రామ పంచాయతీ ఆధాయానిన్న పెంచుకోవాలన్నారు. డెంగ్యూ, చికున్‌గున్యా వంటి జ్వరాలు ప్రబలకుండా ఎప్పటికప్పుడు గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు. సచివాల య సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం వల్లే రైతు బలి :టిడిపి

చిత్తూరురూరల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:



రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పే జగన్ ప్రభుత్వంలో పెనుమూరు మండలం రామక్రిష్ణాపురం పంచా యతీకి చెందిన రత్నం అనే రైతు తన భూమి కోసం మండల రెవిన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతూ అధికారుల నిర్లక్ష్యంతో శనివారం కార్యాలయంలోనే మృతి చెందాడని తెలుగుదేశం నాయకులు పేర్కొన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ రైతు రత్నంకు కోర్టు నుంచి అనుకూలంగా తీర్పు వచ్చినప్పటికీ దానిని అమలు పరచాల్సిన అధికారులు వైసిపి నాయకులకు వత్తాసు పలుకుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆయన మృతి చెందాడని పేర్కొన్నారు. రైతు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్‌చేసారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి పాచిగుంట మనోహర్‌నాయుడు, చిత్తూరు పార్లమెంటరీ రైతు విభాగం అధ్యక్షుడు నాగేశ్వరరాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ, క్రిష్టియన్ సెల్ అధ్యక్షుడు మేషక్, రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధిహేమాద్రినాయుడు, కార్యాలయ కార్యదర్శి మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



యాదమరి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: మండల పరిధిలోని బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతను మృతి చెందాడని ఎస్ఐ సుమన్ తెలిపారు. నందిని హోటల్‌కుసమీపంలోజరిగినరోడ్డుప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయని పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. ఆ వ్యక్తి శనివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూమృతి చెందాడనిఈమేరకుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ పేర్కొన్నారు.

## ఒక్క చిన్నారికి తప్పిపోకుండా వ్యాధి నిరోధక టీకాలు

**- సిహెచ్ఓ లక్ష్మీనారాయణ**



యాదమరి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: క్షేత్ర స్థాయిలో ఒక్క చిన్నారి తప్పిపోకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని యాదమరి పిహెచ్‌సి సిహెచ్ఓ లక్ష్మీనారాయణ సిబ్బందిని ఆదేశించారు. అవుట్ రీచ్ ఇమ్యునైజేషన్ కార్యక్రమంను శనివారం ఆయన పెరుమాళ్ళపల్లిలో తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గర్భవతులు వేసుకోవాల్సిన టీకాలు, ప్రసవానంతరం వేసుకోవాల్సిన టీకాలపై అవగాహన కల్పించారు. మహిళా ఆరోగ్య కార్యకర్త జ్యోతి, ఆశా కార్యకర్త వినాయకి తదితరులు పాల్గొన్నారు.

## 7న నూతన సుబ్రమణ్యస్వామి దేవాలక కుంభాభిషేకం

గుడిపాల, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: మండలంలోని పాపసముద్రం పంచాయతీ అడవిచేను గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వళ్ళి సమేత సుబ్రమణ్యం స్వామి దేవాలయ కుంభాభిషేకం కార్యక్రమంను ఈ నెల 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 6వ తేదీ కలశపూజ, 7వ తేదీ దేవాలయంలోవిగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేకం నిర్వహించనున్నారు. అలాగే అదే రోజు భక్తులకు అన్నదాన కార్యక్రమంవుంటుందనిరాత్రివళ్ళితిరుమనంవీధినాటకంప్రదర్శన వుంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## పయాణీకులకు ఇబ్బందులు కలిగించొద్దు

కుప్పం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

కుప్పం ఆర్టీసీ బస్టాండుకు వచ్చే ప్రయాణీకులకు ఇబ్బందులు కలిగించవద్దని కుప్పం ఆర్టీసీ డిపో మేనేజర్ టికె స్వామి తెలుగుదేశం పార్టీ నేతలను కోరారు. గతమూడు నెలలుగా ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో తాత్కాలిక అన్న క్యాంటీన్ ద్వారా తెదేపా నేతలు అన్నదానం చేస్తున్నారు. కాగా ఆర్టీసీ డిపోకు నిత్యం వేలాది ప్రయాణీకులు వస్తుంటారని వారి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిఎం పేర్కొన్నారు. కృష్ణగిరి బస్సులు తిరిగే మార్గం కావడంతో ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఆయన తెదేపా నేతలను కోరారు.

## రోడ్డు సౌకర్యం కల్పించండి సారూ !!



కుప్పంరూరల్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

మండలంలోని రాగిమానుమిట్ట నుంచి గౌడప్పనూరు మీదుగా వసనాడు గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిం చాలని గ్రామస్తులు కోరుతున్నారు. గత కొన్నేళ్లుగా ఈ మార్గంలో రోడ్డు వేయాలని అధికారులు, ప్రజాప్రతి నిధులను కోరినా ఫలితం లేకుండా పోతోందన్నారు. వర్షాలు పడితే మట్టి రోడ్డంతా గుంతలమయంగా మారి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారుతోందన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి నూతనంగా సిమెంట్ రోడ్డు వేయాలని కోరుతున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## శ్రీఅభయ ఆంజనేయస్వామికి విశేష పూజలు

గంగవరం, సెప్టెంబరు 3, ప్రభాతవార్త : మండలంలోని తాళ్ళపల్లె పంచాయతీ ఏదూరు గ్రామ సమీపంలోని కొండపై వెలసిన శ్రీ అభయ ఆంజనేయ స్వామికి ఏదూరు గ్రామస్తులు శనివారం విశేషపూజలు నిర్వహించారు. ప్రతిఏటా శ్రావణ మాసం సందర్భంగా చివరి శనివారం గ్రామస్తులు అందరూ ఉపవాసంలో స్వామి వారికి అర్చకులచే పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి, అభిషేకాలు నిర్వహించి శనివారాల పండుగను స్వామి వారి సన్నిధిలో చేసుకోవడం అనాధిగా వస్తున్న ఆనవాయితీ. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారు భక్తుల పాలిట కోరిన కోరికలు తీర్చే కల్పతరువుగా స్థానిక భక్తుల ప్రగాఢ విశ్వాసం. స్వామి వారి దర్శనం కోసం చుట్టు పక్కల గ్రామాల భక్తులే కాక కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల భక్తులు కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బంగారమ్మ ఆలయంలో తులాభారం

కార్వేటినగరం, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:



కార్వేటినగరం గ్రామదేవతయిన బంగారమ్మ ఆలయంలో తులాభారం జరిగినట్లు ఆలయ అధ్యక్షుడు కొప్పేటి ప్రసాద్ తెలిపారు. తమిళనా డులోని వాలాజకు చెందిన పవిత్ర శశికుమార్‌ల కుమారుడు యస్. జశ్వంత్ 7కేజీల500 గ్రాములు బరువు వుండగా 2500రూపాయిలు, అరుక్కోణం లోని తర్కోళం గ్రామానికి చెందిన దుర్గాయోగానందంల కుమార్తె వై.నక్షత్ర 5కిలోల150గ్రాముల బరువు వుండగా 1501 రూపాయిలు వచ్చిందన్నారు. మొత్తం 4001 పైకాన్ని ఆలయాభి వృద్ధికి ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఉపాధ్యక్షులు రంగనాథమొదలియార్, సెక్రటరి చంద్రశేఖర్‌పిళ్లె, భక్తులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ నిర్ణయం - గురుపూజోత్సవం బహిష్కరణ

చిత్తూరు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని సోమవారం జరిగే గురుపూజోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవంను బహిష్కరించాలని యుటిఎఫ్ నిర్ణయించింది. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ఉపాధ్యాయులపై నిర్బంధాలు, అడిగితే అరెస్టులు, పోరాటాలు చేసే వారిని దోషుల్లా చూస్తూ, హామీలు అమలు చేయాలని అడిగితే నోటీసులు ఇవ్వడం, బైండోవర్ వంటికి చేసి ఉపాధ్యాయులను ప్రభుత్వం భయభ్రాంతులు చేస్తోందని జిల్లా యుటిఎఫ్ నాయకులు జివి రమణ, పి.సుధాకర్‌రెడ్డిలు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర యుటిఎఫ్ అధ్యక్షుడు టి.రఘుపతిరెడ్డి ఇచ్చిన పిలుపుమేరకుఉపాధ్యాయదినోత్సవంసయుటిఎఫ్ బహిష్కరించాలని నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు.

## మద్యం దుకాణాలపై నిఘా

పాలసముద్రం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:



ప్రభుత్వ మద్యం దుకాణాలపై ప్రత్యేక నిఘావుంచినట్లుమద్యండిపోఎస్ఐ రామ కృష్ణశాస్త్రి పేర్కొన్నారు. ఎక్సైజ్ డిపో మేనేజర్ దయాసాగర్, ఇన్స్పెక్టర్ లక్ష్మణ రావుఆదేశాలమేరకుశనివారంఎస్ఐ రామ కృష్ణ శాస్త్రి పాలసముద్రం మండలంలోని మద్యందుకాణాలనుతనిఖీ చేశారు. ఆయన మద్యం షాపు సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం అమ్మకాలు చేయాలన్నారు. సూపర్‌వైజర్లు ప్రతిరోజు ఉదయం10.30గంటలకుబ్యాంకుల్లోనగదుజమచేయాలన్నారు. అలాగేరాత్రి సమయాల్లో మద్యం దుకాణాల వద్దతప్పనిసరిగా కాపలా వుండాలన్నారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ జాన్సన్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్‌ను సన్మానించిన జడ్పీ ఛైర్మన్



చిత్తూరు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ బి.సుబ్బారెడ్డిని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు శనివారం ఆయన ఛాంబర్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ బి.సుబ్బారెడ్డికి శబరిమలై అయ్యప్ప స్వామి ప్రసాదాలను అందజేశారు.

# గూడూరు డివిజన్

సూళ్లూరుపేట, కోట, వెంకటగిరి, బాలాయపల్లి దొరవారిసత్రం,

## రవీంద్రభారతిలో ఆర్‌బీఎస్ క్లబ్ వేడుకలు



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని రవీంద్రభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఆర్‌బీఎస్ క్లబ్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రెడ్డి ప్రవీణ్ మాట్లాడుతూ యూనివర్సల్ లాంగ్వేజ్ అయిన ఇంగ్లీష్‌లో విద్యార్థులకు పట్టు సాధించేందుకు హైస్కూల్‌లో ఆర్‌బీఎస్ క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ క్లబ్ ద్వారా విద్యార్థులకు ప్రతి నెలా ఇంగ్లీష్‌కు సంబంధించి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. దీని ద్వారా విద్యార్థులు ఇంగ్లీష్‌పై పట్టు సాధించడమే కాకుండా అనర్గళంగా మాట్లాడేందుకు మార్గం సుగమం అవుతుందని ప్రవీణ్ చెప్పారు. ప్రస్తుతం రవీంద్రభారతి హైస్కూల్‌లో విద్యార్థులు ఆర్‌బీఎస్ క్లబ్‌లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపుతున్నారని అన్నారు. అనంతరం ఆర్‌బీఎస్ క్లబ్ వేడుకల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఊనుగుంటపాలెంలో అన్నదానం

కోట, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త



కోట మండలం ఊనుగుంటపాలెం గ్రామంలో శనివారం కొడవలూరు దీపక్‌రెడ్డి ఎస్టీ కాలనీలో వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కొడవలూరు ధనంజయరెడ్డి దాతృత్వంతో అన్నదాన కార్యక్రమం జరిగింది. ప్రతి ఏటా గణేష్ ఉత్సవాల్లో గ్రామాల్లోని వినాయక విగ్రహాలను ధనంజయరెడ్డి సొంత నిధులు వెచ్చించి ఏర్పాటు చేస్తుంటారు. ఈ క్రమంలో ఊనుగుంటపాలెంలో గణేష్ ఉత్సవాలకు విగ్రహాలను ఏర్పాటు చేశారు. కొంతమంది యువతకు గణేష్ గుర్తు కలిగిన బనియన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు చేవూరు నాగేశ్వరరావు, తన్నమాల కోటారెడ్డి, సర్పంచ్ చెంగయ్య, ఎంపీపీ అంజమ్మ, నాగూర్‌యాదవ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ భవనాలు తనిఖీ చేసిన డీఆర్

కోట, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త



కోట మండలం ఊనుగుంటపాలెం గ్రామంలో శనివారం సచివాలయ భవన నిర్మాణ పనులను వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కొడవలూరు ధనంజయరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల ముంగిటకు పాలన అందించాలన్న మహోత్తరమైన ఉద్దేశ్యంతో గ్రామ సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని చెప్పారు. గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రాలకు రాకుండా సచివాలయాల్లోనే అన్ని సేవలు ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట వైసీపీ నాయకులు కోటారెడ్డి, చేవూరు నాగేశ్వరరావు, శ్రీనివాసులు, నాగూర్‌యాదవ్, సర్పంచ్ చెంగయ్య తదితరులు ఉన్నారు.

## కోటలో పౌష్టికాహార మాసోత్సవాలు

కోట, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త



కోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఇన్‌ఛార్జి సీడీపీవో జ్యోతి ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి వివరించారు. చిన్నారులకు ఆరు నెలలు నిండిన వెంటనే అనుబంధ ఆహారాన్ని ఇవ్వాలని సూచించారు. రక్త హీనత ఉన్న గర్భిణులు, బాలింతలు ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, పద్మ, శేషమ్మ, బుజ్జమ్మ, శశి, మంజుల, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెవెన్యూ డివిజన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా తులసిరామ్

బాలాయపల్లి సెప్టెంబరు 3 ప్రభాతవార్త



గూడూరు డివిజన్ రెవెన్యూ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా తులసి రామ్, కార్యదర్శిగా అజ్మతుల్లా ఖాన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు. సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తామని తెలిపారు.

# అందరినీ కలుపుకొని పోతాం

**- కేశవరంలో ఎమ్మెల్యే వరప్రసాదరావుకు ఘనస్వాగతం**

**- గడపగడప కార్యక్రమంలో ఎమ్మెల్యే**

కోట, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త



మండలంలోని కేశవరం గ్రామంలో శనివారం సాయంత్రం గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ వెలగపల్లి వరప్రసాదరావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా ఎమ్మెల్యే వరప్రసాదరావు గ్రామానికి చేరుకోవడంతో చిట్టేడు సొసైటీ ఛైర్మన్ ఉలవకాయల ప్రసాద్, సర్పంచ్ శ్రీరామ్ కృష్ణస్వాతి, వైసీపీ నాయకులు గురుస్వామి, విగ్రహాల రఘురామయ్యలు ర్యాలీతో ఘనస్వాగతం పలికారు. బాణాసంచా వేడుకలు, తప్పెట్లు, తాళాలు, పూలవర్షంతో ఎమ్మెల్యే వరప్రసాద్‌ను ముంచెత్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడుతూ అందరినీ కలుపుకుంటూ అభివృద్ధి చేస్తామన్నారు. దేశంలోని ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో నిర్దేశిత సూత్రాలను తూచా తప్పకుండా పాటిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డే అన్నారు. వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్య రంగాల్లో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే వరప్రసాదరావు ప్రతి ఇంటికి వెళ్లి మూడున్నరేళ్ల పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఒక్కో సచివాలయానికి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రూ.20 లక్షలు కేటాయించిందని, ఆ నిధులను గ్రామంలో అందరితో చర్చించి తీర్మానం చేసి ఆ పనులు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి, ఎంపీడీవో భవాని, ఏపీవో విజయమ్మ, మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, వైసీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం మైనార్టీ నాయకులు షేక్ మొబిన్‌బాషా, గూడూరు డివిజన్ యువ నాయకులు చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, చిట్టేడు సొసైటీ ఛైర్మన్ ఉలవకాయల ప్రసాద్, వైసీపీ నాయకులు గురుస్వామి, సర్పంచ్ శ్రీరాంకృష్ణస్వాతి, విగ్రహాల రఘురామయ్య, ముమ్మడి సుబ్బయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవాన్ని బహిష్కరిస్తున్నాం

కోట, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలు కీలక నిర్ణయం తీసుకున్నాయని కోట మండల యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శిమువ్వలమనోహర్‌చెప్పారు. శనివారం ఆయన కోటలో విలేఖరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సెప్టెంబర్ 5న ప్రభుత్వ పురస్కారాలు, సన్మానాలు తిరస్కరిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులను ప్రభుత్వం అవమానిస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అక్రమ నిర్బంధాలు, బైండోవర్‌లను తీవ్రంగా పరిగణిస్తున్నామని చెప్పారు. సొంత ఫోన్లలో ఫొటోలతో హాజరు వేసేలా ఒత్తిడి తీసుకొస్తున్నారని చెప్పారు. సీపీఎస్ రద్దు హామీని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారని చెప్పారు.

## కోటలో సినిమా షూటింగ్ సందడి

కోట, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

కోట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నీలకంఠ సినిమా చిత్రీకరణ జరిగింది. హీరో మాస్టర్ మహేంద్ర, హీరోయిన్ యాషికా చౌదరిలపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ఎన్నికల్లో సర్పంచ్ ప్రచారాన్ని చిత్రీకరించారు. కోటలో సినిమా షూటింగ్ జరుగుతుండటాన్ని తెలుసుకున్న ప్రజలు చూసేందుకు ఎగబడ్డారు. ఇటీవలే కోటమ్మ గుడి వద్ద ఓ సినిమా షూటింగ్ జరిగిన విషయం తెలిసిందే.

## పీఎం కిసాన్ రావాలంటే ఈకేవైసీ చేసుకోవాల్సిందే

**- తడ ఎంఎఓ జ్యోతిర్మయి**

తడ, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

తడ మండలంలోని రైతులు పీఎం కిసాన్, రైతు భరోసా లబ్ధిదారులు కావాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎ.జ్యోతిర్మయి తెలిపారు. ఇంతకుముందు ఇన్‌స్టాల్‌మెంట్ పడిన వారు కూడా ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. రైతులు ఆయా గ్రామాల్లోని విఏఏలను కాని, తనను కాని సంప్రదించాలని కోరారు. వాస్తవానికి ఈ నెల 7 వరకు ఈకేవైసీ కోసం కాలపరిమితి ఉన్నప్పటికీ చివరి రెండురోజులు పీఎం కిసాన్ వైబ్‌సైట్ పనిచేయకపోతే చేయలేము కనుక 5వ తేదీలోగా రైతులు తొందరపడాలని ఆయన చెప్పారు. అలా కాకపోతే పీఎం కిసాన్ మరియు రైతు భరోసాడబ్బులుజమకావుకాబట్టిరైతులుతొందరపడాలనిశనివారంఒక ప్రకటనలో జ్యోతిర్మయి పేర్కొన్నారు.

## జాతరలో భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు

**-ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ**

వెంకటగిరి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త



ఈ నెల 14,15 తేదీలలో జరగబోవు గ్రామ శక్తి పోలేరమ్మ జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటామని ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పద్మసాలే కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం కమిషనర్ గంగాప్రసాద్‌తో కలిసి అమ్మవారిని తయారు చేసే కుమ్మరవీధి, అమ్మవారి అలంకార మండపం ఉన్న జీనుగల వారి వీధుల్లో వారు జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రయినేజి కాలువల్లో భక్తులు పడకుండా సిమెంట్ బండలు వేయిస్తామని తెలిపారు. జాతరలో భక్తులకు తాగు నీటి సమస్యలేకుండా చేస్తామని, ఎంత మంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్ ఉమామహేశ్వరి, కౌన్సిలర్స్ మాడ జానకీరామయ్య, శ్రీనివాసులురెడ్డి, విజయలక్ష్మీ, నాయకులు చింతపట్ల మురళీకృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు దివ్యాంగుడికి పింఛన్ మంజూరు

వెంకటగిరి సెప్టెంబరు 3 ప్రభాతవార్త

నడవలేని మాట్లాడలేని, నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగుడు చింతపట్ల వెంకటేశ్వర్లు రద్దయిన పింఛన్‌ను వైస్‌ఛైర్‌పర్సన్ ఉమామహేశ్వరి తిరిగి ఇప్పించారు. దివ్యాంగుడి అన్న రేషన్ కార్డులు ఇతని పేరు ఉండడంతో పింఛన్ రద్దు అయింది. పింఛన్ రద్దయిన విషయాన్ని ఎంఎల్ఎ ఉన్నతాధికారులదృష్టికి తీసుకొని వెళ్ళి తిరిగి మంజూరు చేయించారు. పింఛన్‌ను ఛైర్‌పర్సన్ భానుప్రియ, పద్మసాలే కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, కమిషనర్ గంగాప్రసాద్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మాడ జానకీరామయ్య, శ్రీనివాసులురెడ్డి, విజయలక్ష్మీ, నాయకులు చింతపట్ల మురళీకృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## టిడ్కోగృహాలను పేదలకు వెంటనే ఇవ్వాలి

**-బిజెపి కన్వీనర్ ఎస్ఎస్ఆర్ నాయుడు**

వెంకటగిరి సెప్టెంబరు 3 ప్రభాతవార్త



కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన టిడ్కో గృహాలను పేదలకు వెంటనే ఇవ్వాలని బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఎస్ఎస్ఆర్ నాయుడు తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పేదల కోసం మంజూరు చేసిన గృహాలను టిడిపి, వైసిపిప్రభుత్వాలు ఇవ్వలేదని తెలిపారు. డబ్బులు చెల్లించి పేదలు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. జడ్‌పి ఉన్నత పాఠశాల స్థలాన్ని ఆక్రమించిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్కూలు స్థలాన్ని ఆక్రమిస్తే తమపార్టీ వారు అడ్డుకున్నారని తెలిపారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోక పోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో భూవివాదాలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. కాగా పేదలకు ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వాలని తెలిపారు. 2024 సంవత్సరంలో బిజెపి అధికారంలోకి వస్తుందన్నారు. సమావేశంలో నాయకులు యోగేశ్వరనాయుడు, దశయ్య తదితరులు పాల్గొన్నారు.

## మోటార్‌సైకిల్ బోల్తా -ఇద్దరికి తీవ్రగాయాలు

నాయుడుపేట రూరల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త

నాయుడుపేట మండలంలోని బిరదవాడ సమీపంలో జాతీయ రహదారిపై మోటార్‌సైకిల్ బోల్తాపడి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం జరిగింది. సేకరించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూళ్ళూరుపేటకు చెందిన కార్తీక్, అశోక్‌కుమార్ అనే ఇద్దరు యువకులు మోటార్‌సైకిల్‌పై నాయుడుపేటకు వచ్చి పనులు పూర్తిచేసుకొని తిరిగి స్వగ్రామమైన సూళ్ళూరుపేటకు వెళ్ళుతుండగా మార్గమధ్యలో బిరదవాడ-శ్రీనివాసపురం మధ్యకు వచ్చేసరికి ముందుగా వెళుతున్న లారీని క్రాస్‌చేయబోయి ప్రమాదవశాత్తు అదుపుతప్పి మోటార్‌సైకిల్ బోల్తాపడింది. దీంతో కార్తీక్, అశోక్‌కుమార్‌లు తీవ్రంగాగాయపడ్డారు. ప్రయాణికులుగుర్తించిక్షతగాత్రులను108సహాయంతోచికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాయుడుపేట పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 7వ తేదీలోగా ఈకేవైసీ పూర్తిచేయాలి

కోట, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

పట్టాపుస్తకాలు కలిగిన రైతులను ఆదుకునేందుకు రైతు భరోసా .. పీఎం కిసాన్ పేరిట సాగు ఖర్చులు నిమిత్తంఏటా కేంద్రం ,రాష్ట్ర ప్రభుత్వాలు రూ 13.500 అందచేస్తున్నాయని మండల వ్యవసాయాధికారి నిరంజన్ కుమార్ చెప్పారు. శనివారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అందులో రాష్ట్ర ప్రభుత్వం రూ 7,500 ,కేంద్ర ప్రభుత్వంరూ6000జమ చేయనుందన్నారు. ఆగస్టు 31 వ తేదీ తుది గడువుగా నిర్ణయించిన తాజాగా ఈనెల 7 దాకా పొడిగించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణదికారులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

# ఐదోవార్డులో వినూత్నంగా బాదుడే..బాదుడు..



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెమనాయుడు ఇచ్చిన పిలుపుమేరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి సూచనలతో పట్టణంలోని ఐదో వార్డులో తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా.రమేష్, పేటబాలాజీ, డిల్లీబాబు, రాములు బాదుడే..బాదుడు కార్యక్రమాన్ని పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి ఇంటికి వెళ్ళి వైకాపా ప్రభుత్వం పెంచిన ధరలు, అనుసరిస్తున్న విధానాలపై కరపత్రాలను పంపిణీచేశారు. ఈసందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందించి ధరలు పెరగకుండా చూసిన ప్రభుత్వం తెలుగుదేశంపార్టీ అని ఈ మూడు సంవత్సరాల్లో వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజలపై అనేక భారాలు, పన్నులు మోపుతూ సామాన్యమానవుడు జీవనం కష్టతరంగా మారిందన్నారు. కనీసం ధరలను అదుపుచేయలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటన్నారు. వీటన్నింటిని ప్రజలు గమనించాలని కోరుతూ నూనె, పప్పుదినుసులు, కూరగాయాలు తదితర వస్తువులు తోపుడు బండిపై పెట్టుకుని తోసుకుంటూ వార్డులో వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమం లో రాష్ట్ర కార్యదర్శులు గాలిచలపతినాయుడు, దశరధాచారి, రెడ్డివారిగురవారెడ్డి, రాష్ట్ర మహిళా నాయకురాలు రేణుకమ్మ, రాష్ట్ర సాంస్కృతికశాఖ కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమణ్యం (బుజ్జి), మాజీ టిఎన్ఎస్ఎఫ్ నాయకులు బిజె.ప్రసాద్, మాజీ ట్రస్టుబోర్డు సభ్యులు గుర్రప్పశెట్టి, పార్టీ ఉపాధ్యక్షుడు పోలూరు శ్రీనివాసులురెడ్డి, తిరుపతి తెలుగుదేశంపార్టీ మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, రాష్ట్ర ఎస్సీసెల్ నాయకులు గోపి, కెవి.ప్రతాప్, సుబ్బయ్య,ప్రకాష్‌నాయుడు, జిలానీ, భాస్కర్‌గౌడ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్‌మిన్నల్‌రవి, తొట్టంబేడుమండలఅధ్యక్షులుగాలిమురళీ నాయుడు,ప్రసాద్‌రావు,ఎంఎల్‌రెడ్డి, మోహన్, దొరబాబు, వినయ్, సుజిత్, యువతఅధ్యక్షులుహేమంత్‌కుమార్,బషీర్,ఖాదర్‌బాషా, డివినారాయణ, ఆర్ముగం, ధనంజయులునాయుడు, పురుషోత్తం నాయుడు, మురళీ, అనిల్, యాదగిరి, అస్మత్, కరీం, ప్రకాష్, గోవిందు, వెంకటేశ్వరచౌదరి, గోగినేని సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలి..గాలిచలపతినాయుడు



తొట్టంబేడు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

వైపాకా ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడులు సంయుక్తంగా తెలిపారు. శనివారం తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడు ఆదేశాలతో శనివారం మండలంలోని పెన్నలపాడు పంచాయతీలో రాష్ట్రకార్యదర్శి గాలిచలపతినాయుడు, మండల తెదేపా అధ్యక్షుడు గాలిమురళీనాయుడుల ఆధ్వర్యంలో బాదుడే..బాదుడు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ నేడు జగన్‌రెడ్డి పాలనలో ఉన్న నిత్యావసర వస్తువుల ధరలను వివరిస్తూ కరపత్రాలను ఇంటింటికి పంపిణీచేశారు. కార్యక్రమంలో తదశరదాచారి, చెంచయ్య నాయుడు, చక్రాల.ఉష, ప్రభాకర్, సుబ్రమణ్యం పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే

కేవీబీ పురం, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:

మనకు ఎప్పటికీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలని మీరందూ దీవించాలని గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఎమ్మెల్యే ఆదిమూలం వెళ్లి పలకరించారు. మండలంలోని కళత్తూరు, దళితవాడల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిమూలం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దళితవాడల్లో ప్రతి గడపకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సరస్వతి ,పట్టాభిరెడ్డి, దశరథరామిరెడ్డి, లోకనాథంరెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## వేపగుంటలో ఇంటింటా ఫీవర్ సర్వే



పుత్తూరురూరల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:

పుత్తూరు మండలంలోని వేపగుంట గ్రామంలో దూరాలు అధికంగా ఉన్నాయన్న సమాచారంతో వైద్యాధికారి జ్యోతిప్రకాష్ తన సిబ్బందితో శనివారం ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించిన అనంతరం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 45 మందికి వైద్య చికిత్సలు అందించారు. ఎంపీపీ మునివేలు చేతుల మీదుగా మందులు, మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రమేష్‌బాబు, పీహెచ్ఎస్ విజయకుమారి, సూపర్‌వైజర్ లలిత, ఏఎన్ఎం రాణి, బాలాజీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీహెచ్ పురంలో అన్నదానం



వడమాలపేట, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:

వినాయక చవితి పురస్కరించుకుని మండలంలోని జీహెచ్ పురం గ్రామంలో శనివారం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి డి.హేమావతి, భక్తులకు అన్నదానం చేశారు. గ్రామంలో వినాయకుని విగ్రహాన్ని ప్రతిష్టించిగతమూడురోజులుగాపూజలునిర్వహి స్తున్నారు. ఇందులో భాగంగా శనివారం వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయ పందర భజ నలు, కోలాటాలు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు గ్రామస్తులు కలసి అన్నదాన చేపట్టారు.

## నిరంతర సాధనతోనే అభ్యున్నతి సాధ్యం

**- ఆచార్య కొమాండూరి శేషాద్రి - ఘనంగా ముగిసిన శతరాగరత్నమాలిక**



తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ః

నిరంతర సాధనతోనే కళాకారులు అభ్యున్నతని సాధించగలరని ప్రముఖ విద్యాంసులు ఆచార్య కొమాండూరి శేషాద్రి పేర్కొన్నారు. ఎస్వీయూ పెర్మార్మింగ్ ఆర్ట్స్, విశ్వామిత్ర సర్వీస్ సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి కె. సుబ్రమణ్యం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఎస్వీయూ అన్నమయ్య భవన్‌లో నిర్వహించి జాతి భేద సప్తతాళ సహిత శతరాగరత్నమాలిక కీర్తనల శిక్షణా కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి శేషాద్రి ముఖ్య అతిథిగా హాజరై తన అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ విభాగాధిపతి డాక్టర్ జె. శంకర గణేష్, వయోలిన్ విభాగాధిపతి డాక్టర్ కె.వి కృష్ణ, విశ్వామిత్ర సర్వీస్ సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి కె. సుబ్రమణ్యం, విద్యార్థులు, ప్రముఖ రంగస్థల నటుడు బొందు రామచంద్రారెడ్డి, టి. వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## గంగజాతరపై ప్రవచనం పోస్టర్ ఆవిష్కరణ



తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ః

శ్రీ తాతయ్య గుంట గంగజాతర ప్రవచానాన్ని గరికపాటి రమేష్‌బాబు ఆధ్వర్యంలో టీటీడీ అన్నమాచార్య కళామందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి హాజరై గరిక పాటి రమేష్‌బాబును ఘనంగా సత్కరించి, అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గోపినాథ్‌రెడ్డి మిత్ర బృందం కొట్టే సుబ్రమణ్యంరెడ్డి, వెంకట్రామయ్య, కొండే చెంగారెడ్డి, తిరుమలయ్య, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్నకు తిరుగు లేదు: పార్టీకి పరాజయం లేదు

శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి



శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

రాష్ట్రంలో జగనన్న సారథ్యానికి తిరుగు లేదని వైకాపా పార్టీకి పరాజయం లేదని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మనకు ధాకా లేదని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యుడు వేలవేడు, మాధవమాల గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము గ్రామాల్లో పర్యటిస్తున్నపుడు జనం స్పందన గమని స్తుంటే ప్రజలతో నిత్యం ఉండే నాయకులకు తిరుగులేదని అర్థమౌతుందన్నారు. పని చేసే వారి సేవలను ప్రజలు మరువరని తనకు లభిస్తున్న ఆఖండ స్వాగతాలు, హారతులను బట్టి తెలుస్తుందని సంతృప్తి వ్యక్తం చేసారు. ఎక్కడకు వెళ్ళిన పూల వర్షం కురిపిస్తున్నారని ఇదే ఉత్సాహం ఓట్లను సంపాదించటంలో కార్యకర్తలు చూపాలని ఎంఎల్ఏ సూచించారు.

## వాసుదేవరెడ్డికి సాంబశివారెడ్డి ఘన సన్మానం



తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ః

సదరన్ డిస్కం తిరుపతి పరిధిలోని డెప్యూటీ ఈఈగా పదోన్నతి పొందిన వాసుదేవరెడ్డిని స్ప్రింగ్ డేల్ పబ్లిక్ స్కూల్ మేనేజర్ సాంబశివారెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డిని తన కార్యాలయ చాంబర్‌లో సాంబశివారెడ్డి మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువ, పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.మరెన్నోఉన్నతపదవులుపొందాలనిసాంబశివారెడ్డిఆకాంక్షించారు

## చవితి సంబరాల్లో గణపతి హోమం: అన్నదానం



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఐదు రోజులుగా జరుగుతున్న వినాయక చవితి సంబరాల్లో భాగంగా శనివారం పట్టణంలో పలు ధార్మిక, సామాజిక కార్యక్రమాలు చోటు చేసుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.సప్తమి పుణ్యవతి సందర్భంగా ముత్యాలమ్మగుడివీదిలోని సంకల్పసిద్ది వినాయక మండపం నందు మహాగణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ సందర్భంగాహాజరైన అతిధి అంజూరు తారక శ్రీనివాసులును నిర్వాహకులు శేష వస్త్రాలతో సత్కరించారు. తరువాత అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో మల్లికార్జునయ్య,బాలాగౌడ్, తేజు, సునీల్, తేజ మహిళలు పాల్గొన్నారు.కాగా స్థానిక భాస్కర్‌పేటలో వెలసిన విజయగణపతి ఆలయంలో కమిటి నిర్వాహకులు పులి రామచంద్రయ్య సారథ్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో చైర్మెన్ ముఖ్యఅతిదిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమాల్లో పులిరాధాకృష్ణ,బంగారు రవి, జగదీష్, పులిహేమా, పులి రమేష్,పేర్నాటి, మోహన్‌కృష్ణ,హరి, శీను, సుధాకర్, చల్లా చంద్రశేఖర్, మాచర్ల బత్తయ్య, ఈశ్వరయన, కన్నా సురేష్, మునిరాజాతదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిటి సారథ్యంలో చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులును సత్కరించారు

## ఆర్థికసాయం

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం వాగవీడు పంచాయతీలోని దళిత వాడకు చెందిన జనార్థన్ అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన విషయంం విదితమే. ఆకుటుంబాన్ని ఆదుకొనుటకు మాజీ రాచగున్నేరి సర్పంచ్ జగన్నాధం నాయుడు రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆయన వెంట అబ్బూరి పుల్లయ్యనాయుడు సూరావారి పల్లికి చెందిన పల్లి ప్రసాద్‌నాయుడులు ఉన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవ సత్కారాలను తిరస్కరించండి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

ఉపాధ్యాయ దినోత్సవం నాడు ప్రభుత్వం చేసే సత్కారాలకు, సన్మానాలను తిరస్కరించాలని కోరుతూ ఏపిటియప్ తిరుపతి జిల్లాశాఖ పిలుపునిచ్చింది. ఏపిటిఎఫ్ తిరుపతి జిల్లాశాఖ అధ్యక్షులు బి.మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి బి.బాలసుబ్రమణ్యంలు మాట్లాడుతూ ప్రతి ఏడాది సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను దుశ్శాలువతో సత్కరిస్తుందని ఈఏడాది కూడా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. పదోన్నతుల్లో వివక్ష చూపుతూ బదిలీలలో ఉపాధ్యాయులను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా వ్యవహరిస్తూ పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ సిపియస్ రద్దు గురించి ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నందున ఈ ఏడాది ఉపాధ్యాయ దినోత్సవాన్ని బహిష్కరించాలని ఏపిటియఫ్ పిలుపు ఇచ్చిందన్నారు. ప్రభుత్వం చేసే సత్కారాలను, సన్మానాలును, అవార్డులను తిరస్కరించాలని ఉపాధ్యాయ లోకానికి పిలుపు ఇస్తుందని ఒప్రకటనలో తెలిపారు.

## మాతమ్మ ఆలయ నిర్మాణం కోసం వితరణ



.తొట్టంబేడు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

మండలంలోని కొండ్రాజుపల్లి అరుంధతీవాడలో మాతమ్మ ఆలయ నిర్మాణం కోసం ఆలయ కమిటీకి తన వంతుసాయంగా రాచగున్నేరి మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాధంనాయుడు సుమారు 50బస్తాల సిమెంటును విరాళంగా అందించారు.ఈసందర్భంగా జగన్నాధంనాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాలు సంప్రదాయాలకు నిలయాలని ప్రతి ఒక్కరు పండుగలను ఎంతో సంతోషంగా చేసుకోవాలన్నారు. ఏసాయం కావాలన్నా తనను సంప్రదించాలని కోరారు. విద్య, వైద్యం కోసం తాను ముందుంటానని వివరించారు.

## తెలుగుదేశం నుంచి వైకాపాలో చేరిక



శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

మండలంలోని పెంకులపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ నాయకులు మద్దు సురేష్, మాధవి, రాజా, మహేష్, మునిరత్నం, చిరంజీవి, ప్రసాద్ తదితరులతోపాటు 20మంది ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి ఎంఎల్ఏ ఆహ్వానించారు. రానున్న 2024 ఎన్నికల్లో గడచిన మెజారిటీ కన్నా ఇంకా మెరుగైన మెజారిటీ వచ్చే విధంగా ప్రతి ఒక్కరు కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు గోపిగౌడ్, సురేంద్రయాదవ్,చంద్రబాబుయాదవ్,రఘుయాదవ్ పాల్గొన్నారు.

## పండుగలు సంప్రదాయాలకు నిలయాలు

-అదనపు జిల్లా జడ్జి అర్చన



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

పట్టణంలోని పాతబస్టాండు సమీపంలో నవభారత్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జ్ఞానబోన వినాయక స్వామిని గతంలో శ్రీకాళహస్తి సీనియర్ సివిల్‌జడ్జిగా విధులు నిర్వహించి, ప్రస్తుతం గుంటూరు జిల్లా అదనపు జిల్లా జడ్జిగా విధులు నిర్వహి స్తున్న అర్చన కుటుంబసమేతంగా విచ్చేసి దర్శించుకున్నారు. వినాయకునికి పూలమాల వేసి ప్రత్యేకపూజలు నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా నవభారత్‌యువజన సంఘం సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో న్యాయవాదులు గరికపాటి రమేష్‌బాబు, రాజేశ్వరరావు, నవభారత్‌యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## తిరుపతి నగరంలో స్వల్పంగా ట్రాఫిక్ మళ్ళింపు

తిరుపతి క్రైం, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ః

ఆదివారం ఐదవ రోజు గణేష్ నిమజ్జన మహోత్సవం నేపథ్యంలో నగరంలో స్వల్పంగా ట్రాఫిక్ మళ్ళించినట్టు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ట్రాఫిక్ మళ్ళింపులు జరిగినట్లు ట్రాఫిక్ డీఎస్పీ 1 కాటమరాజు శనివారం విలేకరులకు తెలియజేశారు. చిన్నా, పెద్దా వినాయ స్వామి ప్రతిమలను మంగళం రోడ్డులోని వినాయక సాగర్‌లోని నిమజ్జనపు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. భారీ వాహనాలకు ఫ్లై ఓవర్ క్రింద సర్వీస్ రోడ్‌లో రాకపోకలను నిషేధించడం జరిగిందన్నారు. ప్రత్యామ్నాయంగా భారీ వాహనాలతో పాటు చిన్నపాటి వాహనాలు కూడా ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్లనే ఉపయోగించుకోవాలన్నారు.

## చవితి వేడుకల్లో ముగ్గుల పోటీలు, ఉట్లోత్సవం



నారాయణవనం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :

వినాయకచవితి వేడుకల్లో శనివారం అన్ని గ్రామపంచాయతీల్లోని కొలువుదీరిన గణనాధుని విగ్రహాల ఎదుట ఆటల పోటీలు, ఉట్లోత్సవం ఘనంగా జరిగింది. మండలకేంద్రంలోని నారాయణవనం దిగువ పద్మశాలీవీధి, పాలమంగళం ఉత్తరపుకండ్రిగలో ఆటల పోటలు, ముగ్గుల పోటీలు, ఉట్లోత్సవం ఘనంగా నిర్వహించారు. యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాలమంగళం ఉత్తరపుకండ్రిగలో జరిగిన ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి దాత నాధముని మునెమ్మ బహుమతులను అందజేశారు.

## 2022 సైనిక్ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రతిభ

**2వ జాబితా ఫలితాల్లో మరో ఇద్దరు విశ్వం విద్యార్థులు ఎంపిక**



తిరుపతి(విద్య), సెప్టెంబర్ 3, ప్రభాతవార్త

జాతీయ స్థాయిలో 2022-2023 విద్యా సంవత్సరానికి జరిగిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకుతో పాటు 59 సీట్లు సాధించిన నెంబర్ 1 కోచింగ్ ఇన్స్టిట్యూట్ విశ్వం విద్యా సంస్థలు అని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్య సంస్థల అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. 2022- 2023 విద్యా సంవత్సరానికి జరిగిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో జాతీయ స్థాయి ప్రథమ ర్యాంకుతో పాటు 59 మంది విశ్వం విద్యార్థులు ఎంపికఅయ్యారని రాష్ట్ర స్థాయిలో 10 లోపు 8 ర్యాంకులు సాధించి తిరుపతి విశ్వం విద్యా సంస్థల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. శనివారం విడుదలైన 2వ జాబితా ఫలితాల్లో కెఆర్ హరిచరణ్, ఎస్ ప్రేమ్ స్వరూప్ ఇద్దరు విశ్వం విద్యార్థులు ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా సీట్లు సాధించిన విద్యార్థులను విశ్వం విద్య సంస్థల అధినేత డా. ఎన్. విశ్వనాథ్ రెడ్డి,అకడమిక్ డైరెక్టర్ఎన్.విశ్వచందన్‌రెడ్డి,కరెస్పాండెంట్ఎన్.తులసీవిశ్వనాథ్ అభినందించారు.

## శ్మశాన వాటిక స్థలంపై పూర్తి స్థాయి విచారణ

తహశీల్దార్ శిరీషా



చంద్రగిరి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

చంద్రగిరి మండలం, కొటాల గ్రామంలో శ్మశాన వాటిక స్థలం ఆక్రమణపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామని తహశీల్దార్ శిరీషా అన్నారు. శనివారం ఉదయం ఆరేపల్లి రంగంపేటలో, మధ్యాహ్నం కొటాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ.రంగంపేట ఎంపిటిసి బోస్ చంద్రారెడ్డి ప్రజా సమస్యలను తహశీల్దార్ శిరీషాకు వివరించి పరిష్కరించాలని కోరారు. ఈ క్రమంలో గ్రామస్థుల నుండి వినతిపత్రాలను స్వయంగా అందజేసి జగనన్న ఇంటి పట్టాలు, పింఛన్‌లు, పాసుపుస్తకాలు, దారి సమస్య వంటి అంశాల తీవ్రతను వివరించారు. ముఖ్యంగా ఎస్టీ కాలనీలకు చెందిన దాదాపు 40 మందికి ఆధార్ కార్డులు లేక ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందుకోలేకపోతున్నట్లు తెలిపారు. కొటాల గ్రామంలో శ్మశాన వాటిక స్థలం ఆక్రమణకు గురైనట్లు ప్రజలు వినతి పత్రం అందజేశారు. దీనిపై సర్పంచ్ గంగులమ్మ భర్త కృష్ణ వివరణ ఇచ్చే క్రమంలో కొంత తోపులాట చోటుచేసుకున్నది. దీంతో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, తహశీల్దార్ స్పందించి ఆక్రమణపై విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. కాగా టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ శ్మశాన వాటిక భూమి కబ్జాపై తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తుండగా సర్పంచ్ గంగులమ్మ భర్త కృష్ణ గ్రామస్థులపై అరుపులు, కేకలతో విరుచుకుపడినట్లు తెలిపారు. ఈ క్రమంలో పోలీసులు స్పందించి ఇరువర్గాలను శాంతింపజేసినట్లు వెల్లడించారు.

## సమస్యలు సభ దృష్టికి తీసుకురండి..!

ఎంపిపి ఎ.వి.బ్రహ్మానందరెడ్డి



రామచంద్రాపురం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

గ్రామాలలోని సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని ఎంపిపి ఏ.వి.బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ రమణ ప్రసాద్ ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖల అధికారులు అభివృద్ధి నివేదికలను సభకు చదివి వినిపించారు. రెవెన్యూ అధికారులు రేషన్ షాపులను తరచూ తనిఖీ చేయాలని ఆదేశించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ వైద్యులు అంటు వ్యాధుల పట్ల అప్రమత్తంగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, ఏఓ స్రవంతి, ఏపిఎం రాధమ్మ, ఏపిఓ హంసవేణి, ఎంఈఓ వెంకటసుబ్బమ్మ, పశు వైద్యాధికారి డాక్టర్ హేమకుమార్, కమ్మపల్లి వైద్యాధికారి డాక్టర్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్‌తో ఓటరు కార్డు అనుసంధానం

చంద్రగిరి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చంద్రగిరి మండల వ్యాప్తంగా ఆదివారం ఆధార్ కార్డుతో ఓటరు కార్డును అనుసంధానం చేసే ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ఓటరు కార్డు కలిగిన వారు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద గల ప్రత్యేక శిబిరాలలో బూత్‌లెవెల్ ఆఫీసర్లను కలిసి ఆధార్ కార్డుతో ఓటరు కార్డును అనుసంధానం చేసుకునేందుకు ఆసక్తిని తెలియజేస్తూ ఫారం-68 సమర్పించవలసినదిగా కోరారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కల్వర్టు లేకుండా రోడ్డా...?

గుత్తివారిపల్లి గ్రామస్థులు ఆందోళన ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారం



రేణిగుంట, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:

రేణిగుంట మండలం గుత్తివారిపల్లి వద్ద నేసనల్ హైవే నిర్మిస్తున్న క్రమంలో గ్రామస్థులు శనివారం నిరసన తెలిపారు. గ్రామం వద్ద గోవిందమ్మ చెరువు నీరు వెళ్ళడానికి కల్వర్టు లేకుండా రోడ్డు ఎలా వేస్తారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కల్వర్టు లేకపోతే గ్రామం మునిగిపోతుందని గ్రామస్థులు తెలిపారు. దీంతో కొంత సమయం అక్కడ గ్రామస్థులు పనులు అడ్డుకుంటూ బైఠాయించి ఆగ్రహించారు. రోడ్డు వేస్తున్న కాంట్రాక్టర్‌తో గ్రామస్థులకు వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న వైకాపా నేత, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ మంజుల పలువురు నేతలు అక్కడ చేరుకున్నారు. సైట్ మేనేజర్ ప్రవీణ్, వేణుగోపాల్‌తో చర్చలు తెలిపారు. సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి విషయం తెలియజేయడంతో ఆయన అధికారులతో మాట్లాడి అధికారుల ద్వారా కల్వర్టు నిర్మిస్తామని తెలపడంతో పరిస్థితి సద్దుమణిగింది.

## రేణిగుంటలో ఆధ్యాత్మికత గోచరించాలి : సర్పంచ్



రేణిగుంట, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:

శ్రీవారి ముఖ ద్వారం అయిన రేణిగుంటలో శ్రీవారి భక్తులు అడుగుపెట్టిన మరుక్షణం వారికి ఆధ్యాత్మికత గోచరించే విధంగా పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని రేణిగుంట సర్పంచ్ నాగేషం పేర్కొన్నారు. రేణిగుంట పాత చెక్‌పోస్టు వద్ద రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్లపై మొక్కలు నాటి డివైడర్లకు సర్పంచ్ ఆధ్వర్యంలో శనివారం రంగులు వేశారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు రేణిగుంట మండల వైకాపా ఇన్‌చార్జి పవిత్రరెడ్డి సూచనలతో, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి ప్రేరణతో పంచాయతీనిర్వాంగా సుందరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. పంచాయతీలో ఇప్పటి వరకు లక్షలాది రూపాయలు వెచ్చించి సీసీ రోడ్లు, నీటి పైపులైన్లు, డ్రైనేజీలు నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబరు ఇన్బానాథన్, వైకాపా నాయకులు రమేష్‌రాయల్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవం బహిష్కరిస్తాం

**- ఉపాధ్యాయ సంఘాలు**

రేణిగుంట, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:

ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల వ్యవహరిస్తున్న వ్యతిరేక విధానానికి నిరసన తెలియజేస్తూ ప్రభుత్వం సెప్టెంబరు 5వ తేదీ నిర్వహించబోతున్న ఉపాధ్యాయ దినోత్సవం బహిష్కరిస్తున్నట్టు ఉపాధ్యాయ సంఘాలు శనివారం ఓ ప్రకటనలో తెలియజేశాయి. ఛలో విజయవాడకు ఉపాధ్యాయ సంఘాలు పిలుపునివ్వకపోయినా వారికి నోటీసులు ఇవ్వడం, ఎక్కడికక్కడ నిర్బందించడం, కొంత మంది ఉపాధ్యాయులను అరెస్టుచేయడం, ఉపాధ్యాయులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని తప్పుపడుతూ బహిష్కరణకు పిలుపునిచ్చారు. పిలుపునిచ్చిన వారిలో ఏపీ యూటీఎఫ్, ఎస్టీయూ, ఏపీటీఎఫ్ 1938, ఏపీటీఎఫ్ 257, తదితరుపాధ్యాయ సంఘాలు ఉన్నాయి.

## గుర్తు తెలియని వృద్ధురాలు మృతి

రేణిగుంట, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:

రేణిగుంట రైల్వేస్టేషన్ పార్కింగ్ స్థలం వద్ద సుమారు 50 సంవత్సరాలు కలిగిన గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెంది ఉండడాన్ని స్థానికులు శనివారం గుర్తించారు. విషయాన్ని అర్బన్ పోలీసులకు తెలియజేయడంతో సంఘటనా స్థలం చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారం లభించలేదు. గత కొద్ది రోజులుగా యాచించుకుంటూ జీవించేదని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని పంచాయతీ కార్మికుల ద్వారా ఖననం చేయించారు.

# భక్తిశ్రద్ధలతో సుమంగళి పూజ

పుత్తూరురూరల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణం ఎస్‌బీఐ కాలనీలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంలో భాగంగా శనివారం ఎస్‌బీఐ కాలనీలో వినాయక మండపంలో ఏర్పాటు చేసిన వినాయక స్వామికి ముత్తైదువులు సుమంగళి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి విఘ్నేశ్వర పూజ కలస స్థాపన గణపతి హోమం నవగ్రహ హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. అలాగే పుత్తూరు పట్టణంలో బెస్త వీధిలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. సాయంత్రం యూత్ వరల్డ్ వారిచే డాన్స్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. అలాగే పుత్తూరు మండలంలోని గొల్లపల్లి గ్రామంలో శనివారం ఘనంగా గణేష్ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. పుత్తూరు మున్సిపాలిటీ కాపువీధిలో ఏర్పాటు చేసిన వినాయక స్వామి ఉత్సవాల్లో భాగంగా వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పుత్తూరు సీఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. 24 వార్డు కౌన్సిలర్ ఏకాంబరం, కాపు వీధి యూత్, చల్లప్ప, ఆనంద్, శ్రీనివాసులు, ప్రశాంత్, వార్డు యువకులు పాల్గొన్నారు.



